# 'అబద్ధాల' రజాకీయం



**ఆ** ఆఫీసులో...

ఆ మాటకు వస్తే- ఆ రీజియన్‌లో డిపార్టుమెంటల్ స్టాఫ్ అందరిలో 'అబ్దుల్ రజాక్' అంటే ఇంచుమించు ఎవరికీ ప్రత్యేకంగా తెలియదు. కాని, 'అబద్ధాల రజాక్' అంటే మాత్రం తెలియనివాళ్ళు లేరు.

'నక్క పుట్టి నాలుగు వారాలు కాలేద'న్నట్లు... నిన్నమొన్న కొత్తగా ఉద్యోగంలో చేరిన కుర్రకారుకు కూడా అతను తెలుసు. ఎందుకంటే... ఆఫీసులో అడుగుపెట్టి

అరగంటయినా కూర్చోకముందే తప్పనిసరిగా వినబడేది అబ్దుల్ రజాక్ పేరు- అదే... 'అబద్ధాల రజాక్' నామం! మరి, అతగాడి 'లీల'లటువంటివి! శ్రీకృష్ణ లీలల గురించి ఆరేళ్ల పిల్లల దగ్గర్నుంచి అరవైయ్యేళ్లకు పైబడ్డ బామ్మల వరకు చిలవలు పలవలుగా చెప్పుకుని ఆనందించినట్లు- అస్మద్ రజాక్‌గారి లీలా విశేషాలు నిత్య నూతనంగా, నవ నవోన్మేషంగా ఉంటూండడంతో వాటిని కథలుగా, గాథలుగా చెప్పుకొని ఆనందించడం వారి దినచర్యలో ఒక ప్రధానభామయ్యింది.

టి.వి. కార్యక్రమాలను (హైదరాబాద్ దూరదర్శన్‌వారి కార్యక్రమాలు కాదులెండి.) చూడనివారి సంఖ్య భారతదేశ జనాభా పెరుగుదల రేటుకంటే ఎక్కువ వేగంగా పెరుగుతోందట. పరమచెత్తాతి చెత్త కార్యక్రమాలను ప్రసారం చేయడంలో వరల్డ్ రికార్డ్ అధిగమించడంతో ఈ కేంద్రం పేరును గిన్నీస్ బుక్‌లోకి ఎక్కించడానికి ప్రతిపాదనలు పోయాయని వదంతి. నూటికి నూరుశాతం అక్షరాస్యత సాధించడం అసాధ్యమేమోగాని- నూటికి నూరుశాతం కల్తీలేని మహాచెత్త ప్రోగ్రాములను ప్రసారం చేసే లక్ష్యాన్ని సుసాధ్యం చేసే లక్ష్యంతో దూరదర్శనీయులు చిత్తశుద్ధితో నిర్విరామంగా కృషి చేస్తున్నారనీ, ఈ రికార్డ్ శాశ్వతంగా గిన్నీస్ బుక్‌లో చోటు చేసుకుంటుందనీ వదంతి.

ఆఖరికి యం. టివి., స్టార్ టి.వి., జీ. టి.వి., బి.బి.సి. వంటి మహా పాప్యులర్ ప్రోగ్రాములను చూసినా కలగని ఆనందం 'రజాక్ లీలలు' వింటుంటే వారికి కలుగుతుంది.

ఎవరైనా, ఎప్పుడైనా అవసరమైన పనివుండి ఆఫీసుకి సెలవు పెట్టవలసి వస్తే, ఆరోజున వారికి ఏదో వెలితిగా అనిపిస్తుంది. మనసు వికలమైపోతుంది. అందువల్ల మరీ అత్యవసరమైతే తప్ప సెలవులు పెట్టడం మానేశారు సిబ్బంది.

దాంతో ఆఫీసులో 'ఆబ్సెంటిజం' అద్భుతంగా తగ్గిపోయింది. ఆఫీసర్‌లు ఆశ్చర్యంతో తమ ముక్కుల మీదే కాకుండా, ఎదుటివారి, ప్రక్కవారి ముక్కుల మీద కూడా వేలువేసే అగత్యం ఏర్పడింది.

అలాగని, 'ఎఫిసియెన్సీ' పెరిగిందంటే అది అడగకూడదు- చెప్పకూడదు. కారణం... ఆఫీసులో వారు కూర్చున్న కాలంలో అధికభాగం రజాక్ నామోచ్ఛారణలో, అతగాడి విశేష శ్రవణంతో గడిచిపోతుంది.

"ఇంతకీ... ఎవరీ అబ్దుల్ రజాక్? ఎక్కడుంటాడు?"- అని అడిగితే సమాధానం చెప్పడం బ్రహ్మతరం కూడా కాదు.

ఎందుకంటే... రజాక్ విషయంలో 'ఫలానా టైముకి ఆఫీసుకి రావా'లన్న నియమమేమీ లేదు. అది ఎక్సెంప్షన్. అతగాడు రావచ్చు- రాకపోవచ్చు. ఎక్కడినుంచైనా

ఫోన్ చేయవచ్చు- చేయకపోనూవచ్చు. చేస్తే అది తను రావడంలేదని చెప్పడం కోసం మాత్రం కాదు. తనతో ఎవరికీ ఏ అవసరాలున్నాయో తెలుసుకోడానికి- అంతే!

అతను వచ్చినా, రాకపోయినా అటెండెన్స్ పడితీరుతుంది. 'ఆబ్సెంట్' అని కాని, 'లేటు' అనికాని, చివరికి 'లీవ్' అనికాని మార్క్ చేసే 'గుండెధైర్యం' ఏ ఆఫీసర్‌కీ ఉండదు. అమావాస్యకో, పున్నమికో వచ్చినప్పుడు ఆ ఖాళీల్లో సరదాగా సంతకాలు పెట్టి వెళ్లిపోతాడు.

ఆఫీసులో అబ్దుల్ రజాక్‌కి ఓ సీటుంది. కాని, ఆ సీటులో అతను పనిచేయడం అంటూ ఉండదు. చేయడానికి అసలు అతను సీటులో కూర్చుంటేగా! ఒకవేళ ఎప్పుడైనా, సంపూర్ణ సూర్యగ్రహణంలాగా అరుదుగా వచ్చి కూర్చున్నా, ఆ కాస్తసేపూ తాను ఆఫీసర్లకి అవసరమైన కార్యాలను, ఎంత క్లిష్టమైనవైనా, ఎంతెంత కష్టతరమైనవైనా ఏవిధంగా సులువుగా సాధించిందీ వర్ణనాత్మకంగా చెప్పడంతోనే సరిపోతుంది. ఆ తర్వాత గ్రహణం విడిచిన చంద్రుడిలాగా మళ్లీ బయటకు వెళ్లిపోతాడు మరో ఘనకార్యం కోసం. ఇంక ఆ సీట్లోని పని సంగతంటారా? బకాసురుడికి ఊరివారందరూ వంతులు వేసుకుని రోజూ ఒకడిని తమనుంచి ఆహారంగా సమర్పించుకున్నట్లు- లేదా... వారాలకుర్రాడికి రోజుకి ఒకరు భోజనం పెట్టినట్లు- అందరూ తలాకాస్తా పంచుకునేవారు. కాదు- ఆఫీసర్‌గారు తనే అందరికీ తలాకాస్తా పంచేవారు. వాళ్ళని అదిరించో, బెదిరించో, లాలించో, బుజ్జగించో, కాళ్లూ-గడ్డం పట్టుకునో వాళ్ళచేత రజాక్ చేయాల్సినపని చేయించేవాడు. ఏ ఆఫీసర్ వచ్చినా ఇది ఆయన డ్యూటీలో ఒక తప్పనిసరి భాగం! ఎవరైనా మొండిముండావాడు కాస్త అటూఇటూ మాట్లాడినా, రజాక్‌ని సగౌరవంగా చూడకపోయినా ఇంక అతగాడు శంకరగిరి మాన్యాలు పట్టవలసిందే!

అబద్ధాలు అందరూ చెప్తారు. మీరూ, నేనూ, మనందరం అబద్ధాలు చెప్పేవాళ్ళమే. కాకపోతే- కొందరు నిజాలు ఎక్కువ చెప్తారు(మహానుభావులు- వారిని వ్రేళ్లమీద లెక్కపెట్టడం కూడా కష్టం.), మరికొందరు అదేదో నిత్యసుమంగళీ వ్రతంలాగా కేవలం అబద్ధాలనే మహా ఎక్కువగా చెప్తారు. ఏతావాతా తేలేదేమిటంటే... ఏ వ్యక్తీ కూడా పూర్తిగా నిజాలే చెప్పడు. సంపూర్ణంగా అబద్ధాలే చెప్పడు. ఉన్న తేడా అల్లా వాటి నిష్పత్తిలోనే..!

మరి, అలాంటప్పుడు అబ్దుల్ రజాక్‌కి 'అబద్ధాల రజాక్' అన్న అన్వర్ధనామం రావడానికి కారణం ఏమిటి?

అతనిలోని విశేషమేమిటంటే... అతను చెప్పే అబద్ధాలన్నీ కల్తీలేని పాలలా, కడిగిన ముత్యాల్లా స్వచ్ఛమైన నిజాల్లా అనిపిస్తాయి. దారితప్పి నిజం చెప్పినా అది అబద్ధం కంపుకొట్టుంది. 'ఏది సత్యం- ఏదసత్యం?' అని మహాత్ముని మరణసందర్భంలో మహాకవి

శ్రీశ్రీ ఆవేదనతో ఆక్రోశించినట్లు, 'ఏది నిజం- ఏదబద్ధం?' అన్న విచికిత్స చేయలేక బుర్రలు బద్దలు కొట్టుకున్నా సహోద్యోగులు అబ్దుల్ రజాక్ చెప్పేవన్నీ అబద్ధాలేనన్న నమ్మకానికి వచ్చేసి అతని మీద 'అబద్ధాల రజాక్' అన్న చక్రాంకితం వేసేశారు.

అయితే... ఈ 'నుడి- నానుడి' కేవలం క్రింది వర్గాలలోనే- ముఖ్యంగా... అతని పరపతిని, పలుకుబడిని చూసి ఓర్వలేని అసూయాపరులలోనే! అధికారవర్గాల్లో మాత్రం- అబ్దుల్ రజాక్ అంటే అఘటనాఘటన సమర్థుడు. అసాధ్యమనేది ఎరుగనివాడు. అందుకే అతని సేవలులేని ఆఫీసర్ జీవితం పోపులేని కూరలాగా రుచిగా ఉండదు. ఉప్పులేని పప్పులాగా చప్పగా ఉంటుంది. అందుకే ఏ ఆఫీసర్ వచ్చినా ఛార్జి తీసుకోకముందే- ముందుగా వినే పేరు... అబ్దుల్ రజాక్‌దే! అతని చాతుర్యం, సేవానిరతిని గురించి వినగానే వారికి కొండంత ధైర్యం వచ్చేది. ఆ ఆఫీసులో తమ టెన్యూర్ నల్లేరు మీద బండిలా సాఫీగా సాగిపోతుందన్న నమ్మకం కుదిరి గుండెనిబ్బరంతో వచ్చేవారు.

అబ్దుల్ రజాక్‌లాగా అడ్డమైన పనులు చేసేవారు ప్రతి ఆఫీసులోనూ ఉంటారు. ప్రతిచోటా ప్రత్యక్షమవుతూనే ఉంటారు. మరి, అలాంటప్పుడు- 'ఇతగాడిలోని ప్రత్యేకత ఏమి'టన్న అనుమానం రావడం సహజం!

ఇటువంటివారిని అందరూ మామూలుగా 'కాకారాయుళ్ళు-చెంచాలు' అని ముద్దుముద్దుగా అంటూండడం అందరూ ఎరిగినదే! 'మరి, ఇతనిలోని కాకాసుర లక్షణాలలోని ప్రత్యేకత ఏమిటి?... అని అబ్బురపడడంలో అసబబు ఏమీ లేదు. అదేమిటో తెలుసుకోవాలంటే నాలుగు దశాబ్దాలు వెనక్కిపోవాలి.

* * *

భారతదేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్టులో వచ్చింది.

ఆంగ్లేయులు చెలాయిస్తుండిన అధికారం భారతీయులకి బదిలీ అయింది. అధికారం చేతులు మారిందేకాని, ఆనవాయితీలు, సాంప్రదాయాలు మారలేదు. భారతీయులది రాచరికానికి అలవాటుపడ్డ ప్రాణాలు. శ్రీరాముడు, ఆయనకు ముందు, ఆయనకు తర్వాత ఎందరో చక్రవర్తులు, మహారాజులు, రాజులు ప్రజారంజకంగా పరిపాలించడం ఇందుకు కారణం కావచ్చు. అందుకే- 'నా విష్ణుః పృధివీపతిః' అన్న నానుడి వచ్చింది.

అంటే... రాజు సాక్షాత్తూ విష్ణు స్వరూపుడని అర్థం. విష్ణుమూర్తి దైవం కాబట్టి ప్రభువును కూడా దైవంగా కొలవడం వారికి అలవాటు అయింది. అందుకే మనం ప్రజాస్వామ్యంలో కూడా రాచరికాన్నే చూస్తాం. ప్రధానమంత్రిని సాక్షాత్తూ చక్రవర్తిగానే

పరిగణిస్తాం; గౌరవిస్తాం. అందుకనే పాలకులు పరాయిదేశస్తులైన బ్రిటిష్‌వారైనా కూడా వారిని చల్లని ప్రభువులుగా కీర్తించాం; విక్టోరియా పరిపాలనని 'రాణీ పాలన' అని చెప్పుకుని మురిసిపోయాం. వారికి సేవలు చేయడంలోనే ఆనందం అనుభవిస్తూ, ఎంత ఎక్కువగా సేవలు చేయగలిగితే అంతగా తమ జన్మ ధన్యాతిధన్యం అయిందని అనుభూతి చెందేవారు ఆనాటి ఉద్యోగులు.

ఇందులో తరతమ భేదం ఉండేది కాదు. ఆఫీసు ప్యూన్ నుంచి ఆఫీసర్ వరకూ తమ సేవలతో ఆంగ్ల అధికారుల కటాక్షవీక్షణాల కోసం పోటీలుపడి ఎగబడేవారు. 'ఇది నీచం, ఇది ఉచ్చం...' అన్న విచక్షణే ఉండేది కాదు. అడక్కుండానే ఒళ్లుపట్టి మాలిష్ చేస్తానంటే వద్దనేవాడు ఎవడుంటాడు? అందువల్ల ఆంగ్లేయాధికారులు అయాచితంగానే ఎన్నో సేవలు పొందుతుండేవారు. అయితే... వారు క్రిందివారికి ఒక పట్టాన దర్శనం ఇచ్చేవారు కాదు. క్రిందివారికి వారిని కలుసుకోవలసిన అవసరమూ ఇంచుమించు ఉండేది కాదు. అవన్నీ హెడ్‌క్లర్కే చూసుకునేవాడు.

అటువంటప్పుడు- 'తమ విధేయతను అధికారుల ముందు ప్రదర్శించడం ఎలా?' ఇందుకోసం ఉభయతారకంగా ఒక ఒరవడిని సృష్టించారు నల్లదొరలు.

ఆరోజుల్లో ప్రతి సంవత్సరం జనవరి ఒకటవ తేదీన 'న్యూ ఇయర్ డే' కాబట్టి ఆఫీసులకి, స్కూల్స్‌కి సెలవు ఉండేది.

ఆరోజున ప్రొద్దున్నే సెక్షన్ ఆఫీసర్లూ, గుమాస్తాలూ అందరూ పోలోమంటూ దొరగారి దర్శనానికి వారింటికి వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేవారు. 'దేవుడిని, రాజుని, పిల్లల్ని చూడడానికి వెళ్లినప్పుడు వట్టి చేతులతో వెళ్లకూడదు' అనేది భారతీయ సాంప్రదాయం కనుక ఒక గ్రీటింగ్‌కార్డునూ, కొన్ని పళ్ళనూ తీసుకువెళ్లేవారు. వాటిని దొరగారి చేతిలో పెట్టి నమస్కారం చేస్తూ శఠగోపం ముందు తలవంచిన భంగిమలో నిలబడి, స్వస్తివాచకం పలికినట్లు శుభాకాంక్షలు వల్లించేవారు.

అయ్యవారు చిరునవ్వుతో వాటిని స్వీకరిస్తూ ప్రతిశుభాకాంక్షలు చెప్తూ చేయి కలిపేవారు.

'అదే మహాభాగ్యం!' అనుకునేవారు. ఆ అదను చూసుకొని వచ్చినవారు తమపేరూ, హోదాలను తెలుపుతూ సూక్ష్మపరిచయం చేసుకునేవారు. దొరవారు కొందర్ని మరికొన్ని వివరాలు అడిగేవారు. అంతటి గౌరవం పొందినవారు అందలం ఎక్కినట్లుగా ఊహించుకొని, 'పద్మవిభూషణ' బిరుదు వచ్చినంతగా మురిసిపోయేవారు. ఆ యోగం పట్టనివారు బాధతో కుమిలిపోయేవారు.

ఆరోజుల్లో 'ఆపిల్స్' చాలా అరుదైన ఫలాలు. గొప్పవారు మాత్రమే కొనగలిగేవారు. అందువల్ల సెక్షన్ ఆఫీసర్‌ల వంటి పైవర్గీయులు ఆపిల్స్ సమర్పించుకుంటే, గుమాస్తాలవంటి క్రిందివర్గీయులు బత్తాయిలతో సరిపెట్టుకునేవారు.

మూలవిరాట్ వాటిని చిరునవ్వుతో స్వీకరించి- అంటే... ఒకసారి వాటిమీద చేయివేసి తాకి, ప్రక్కనే పూజారిలా నిలబడివున్న అధికారికి ఇచ్చేవారు. ఆయన వాటిని అక్కడే పబ్లిక్‌గా ప్రదర్శిస్తే దిష్టి తగులుతుందనుకొని ఎటాచ్‌డ్ రూం లోకి తీసుకువెళ్లి బల్లమీద ఉంచేవారు. అంతటితో దేవుడికి నైవేద్యం పెట్టడం అయ్యేది.

అయితే... గుళ్లో దేవుడికి నైవేద్యం పెట్టే పూజారి సగం తీసుకున్నా మిగిలిన సగం ఇచ్చేస్తారు.(కొన్నిచోట్ల పూర్తిగా తిరిగి ఇచ్చేస్తారు.) కాని, ఇక్కడంతా వన్‌వే ట్రాఫిక్! ఇచ్చిన ఫలపుష్పాదులు లోనికిపోవడమే కాని, తిరిగి బయటకు రావడం అంటూ ఉండదు.

'మారాజులు స్వీకరించిందే మహాభాగ్యం!' అని భావించి మురిసిపోతూ తిరిగి వచ్చేవారు. ఎవరి శక్తికొద్దీ, స్థాయికొద్దీ వారిచ్చే కానుకల పరిమాణం, విలువ ఉండేవి.

1930ల తర్వాత ఉన్నత ఉద్యోగాలలో ఆంగ్లేయులతోపాటు భారతీయులు కూడా నియమితులవుతూ వచ్చారు. తెల్లదొరలకులాగే నల్లదొరల విషయంలోనూ క్రింది ఉద్యోగులు ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ వచ్చారు. దేశం స్వతంత్రమై అధికారులందరూ భారతీయులే అయినా కూడా ఈ సాంప్రదాయం మారలేదు. సుమారు 1960 వరకు ఈ నూతనసంవత్సర భాగోతం జరుగుతూనే ఉండేది. అటుతర్వాత క్రమంగా ఈ ఒరవడి తగ్గుతూ వచ్చి, చివరకి ప్రభుత్వం 'న్యూ ఇయర్ డే' సెలవును రద్దు చేసినతర్వాత పూర్తిగా ఆగిపోయింది. ఈనాటి బుద్ధిమంతులు ఒక న్యూ ఇయర్ గ్రీటింగ్ కార్డు పంపి చేతులు దులుపుకుంటున్నారు.

అది 1960 దశకం తొలి సంవత్సరాల కాలం.

అబ్దుల్ రజాక్ కొత్తగా గుమాస్తాగా చేరాడు. అప్పుడు నల్లదొర శివరావుగారు ఆఫీసర్‌గా ఉండేవాడు. ఆయన కూడా తెల్లదొరల డాబూ-దర్పాన్ని పుణికి పుచ్చుకున్నవాడు. మామూలు గుమాస్తాలకి ఆయన ఛాంబర్ లోనికి వెళ్లవలసిన అవసరం అతి అరుదుగా వచ్చేది. సిబ్బందికీ, దొరవారికీ మధ్య ఏ ఇబ్బందీ లేకుండా వారధిలాగా భద్రంగారు భద్రంగా ఉండేవారు. ఆయన తన కుర్చీలో భద్రంగా కూర్చుని రెండుకళ్లతో నలువైపులా చూస్తూ అజమాయిషీ చేస్తుండేవాడు.

ఆరోజు జనవరి ఒకటి. నూతన సంవత్సరానికిగాను సెలవు దినం.

శివరావు క్వార్టర్స్ ఆ ప్రాంగణంలోనే ఉండేది.

ఆఫీసు సిబ్బంది ఆరోజు ప్రొద్దుటే దొరగారిని కలిసి శుభాకాంక్షలు చెప్పి యథాశక్తి ఫలంకోసం 'ఫల సమర్పణ' చేయాలని అనుకున్నారు.

శివరావుగారు డ్రాయింగ్ రూం లోని నగిషీకుర్చీలో కూర్చున్నారు. భద్రంగారు ప్రక్కనే శివుని ప్రక్కన వీరభద్రుడిలాగా నిలబడి ఉన్నారు. ఒక్కొక్కరే వచ్చి కానుకలు, గ్రీటింగ్‌కార్డ్లు వంటివి సమర్పిస్తుంటే "వారు ఫలానా..." అని భద్రంగారు పరిచయం చేస్తున్నారు. శివరావుగారు "ఓహో... అలాగా!" అనీ, "బాగున్నారా?" అనీ చిరునవ్వుతో పలకరించి కానుకలను స్వీకరించి భద్రంగారి చేతికి అందిస్తున్నారు. భద్రంగారు వాటిని యమభద్రంగా అందుకుని వెనుక గదిలోకి వెళ్లి బల్లమీద పెట్టి వస్తున్నారు.

చిన్న అధికారుల స్థాయిలో ఉన్నవారు శివరావుగారి ముందు వేసివున్న అరడజను కుర్చీల్లో కాసేపు కూర్చుని వెళ్తున్నారు. అబ్దుల్ రజాక్ కూడా తన సహ ఉద్యోగులతో అక్కడికి వచ్చి జరుగుతున్న తతంగాన్ని చూసి ఆనందిస్తున్నాడు.

ఇంతలో... భద్రంగారికి 'ప్రకృతిపిలుపు' జోరుగా వచ్చినట్లుంది. బయటికి చెప్పడానికి మొహమాటపడి, వెనుకగదిలోకి పళ్ళు పెట్టడానికి వెళ్లినవాడు అటునుంచి అటే టాయిలెట్ వైపు జారుకున్నాడు.

ఇంతలో... ఇంకెవరో వచ్చి శివరావుగారికి పళ్ళు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పి, ప్రక్కన భద్రంగారు లేకపోవడంతో తనను తానే పరిచయం చేసుకున్నాడు. పళ్ళు అందియ్యడానికి ప్రక్కకి చూస్తే భద్రంగారు అక్కడలేరు. 'ఎటుపోయాడా?...' అని అటూ ఇటూ చూడసాగారు.

సంగతీ, సందర్భం గ్రహించిన రజాక్ చెంగున రంగంలోకి దూకాడు.

"ఇలా ఇయ్యండి సార్... లోపల పెట్తాను" అంటూ సమాధానంకోసం కూడా ఎదురుచూడకుండా శివరావు చేతుల్లోంచి పళ్ళు తీసుకుని వెనుకగదిలోకి వెళ్లాడు.

అక్కడ బల్లమీద పెట్టివున్న పళ్ళు చూసేసరికి కళ్లు చెదిరాయి అతనికి. అటూ ఇటూ చూశాడు రజాక్. ఎవ్వరూ లేరు. పెద్దసైజులో ఎర్రగా నిగారిస్తున్న రెండు ఆపిల్ పళ్ళను తీసుకున్నాడు. ఎవరూ చూడడంలేదని నిర్ధారించుకుని వదులుగా వుండే ఆఫ్ఘన్ పైజామా జేబులోకి వాటిని తోసేశాడు. ఆ జేబులు ఎంత లోతుగా ఉంటాయంటే చంటిపిల్లవాడిని అందులోకి కుక్కేసినా బయటకు కనబడడు. ఏమీ ఎరగనివాడల్లే పిల్లిలా బయటకు వచ్చేసి యథాస్థానంలో నుంచున్నాడు రజాక్.

భద్రంగారు తనని శివరావుగారు ఎప్పుడు పిలుస్తారోనన్న ఆదుర్దాతో త్వరత్వరగా ప్రకృతిపిలుపుకి జవాబిచ్చి హడావుడిగా బయటకు వచ్చేశాడు. వస్తూ రజాక్ చేసిన

ఘనకార్యాన్ని గమనించాడు. ఆ విషయం రజాక్ ఎరుగడు. భద్రంగారు మామూలుగా వచ్చేసి శ్రీరాముని ప్రక్కన లక్ష్మణునిలాగా యధాస్థానంలో నిలబడ్డాడు.

చిట్టిపొట్టి ఆఫీసర్లు, సెక్షన్ సూపరింటెండెంట్‌లూ అయ్యాక- శివరావుగారి ఆఫీసులో పనిచేసే సిబ్బంది టర్న్ వచ్చింది. వారి తరపున ఒక సీనియర్ యు. డి. సి. అందరి తరపునా ఒక బహుమతి, అరడజన్ ఆపిల్ పళ్ళూ ఇచ్చి శుభాకాంక్షలు చెప్పి నమస్కరించాడు.

భద్రంగారు ఆఫీసు సిబ్బందిని పేరుపేరునా పరిచయం చేశాడు. రజాక్‌ను పరిచయం చేసేటప్పుడు మాత్రం రజాక్‌వంక చూస్తూ అతని పేరును మరీ ఒత్తి పలికాడు.

సిబ్బంది వెనకాల నిలబడివున్న రజాక్ ముందుకి వచ్చి తన పైజామా జేబులోంచి ఆ రెండు ఆపిల్స్‌నూ బయటకు తీసి "సార్... మీకు స్వయంగా శుభాకాంక్షలు చెప్తున్నాను. హ్యాపీ న్యూ ఇయర్ టు యు!" అంటూ ఆ రెండు పళ్ళనూ శివరావుగారి చేతిలో ఉంచాడు.

అంత పెద్ద ఆపిల్ పళ్ళను ఒక సామాన్య గుమాస్తా ఇచ్చేసరికి శివరావుగారు ఆశ్చర్యపోయారు. చిరునవ్వుతో వాటిని స్వీకరించి, కాళ్లకు నమస్కారం పెట్టున్న రజాక్ భుజం తట్టి లేవదీశాడు.

భద్రంగారి పెదవులపై ఒక విషపునవ్వు భద్రంగా చోటుచేసుకుంది.

మిగిలిన సిబ్బంది ఆశ్చర్యంలో మునిగిపోయారు. 'అందరితోపాటు చందా యిచ్చిన అబ్దుల్ రజాక్ ఇప్పుడు స్వయంగా మళ్లీ ఆపిల్స్ ఇయ్యడమేమిటి? కాకా వేషాలు కాకపోతే!' అనుకున్నారు.

శ్రీకృష్ణ దేవరాయలవారి కాలంలో 'అఫ్జల్ ఖాన్' అనే మహమ్మదీయ సర్దార్ ఉండేవాడు. అతను ముక్కోపి. ఒకరోజున క్షయరోగి అయిన బాటసారి ఒకడు అఫ్జల్ ఖాన్ ఇంటి అరుగు మీద ఆరాత్రి పడుకుని విశ్రమిస్తున్నాడు. అతను విపరీతంగా దగ్గుతుంటే నిద్రాభంగమై అఫ్జల్ ఖాన్‌కి పట్టరాని కోపం వచ్చింది. ఆ దగ్గు గోల భరించలేక బయటకు వచ్చి ఆ బాటసారి తల నరికివేశాడు.

ఈ నేరం రాయలవారి ముందు విచారణకు వచ్చింది. ప్రభువులు అఫ్జల్ ఖాన్‌కి మరణదండన విధించారు.

అయితే... మహామంత్రి తిమ్మరుసు- "ప్రభూ... ఇతనికి తమ కొలువులో మంచి ఉద్యోగం ఇచ్చి సత్కరించండి" అని సలహా ఇచ్చాడు.

తగిన కారణం లేనిదే తిమ్మరుసు అలా చెప్పివుండడని రాయలవారు గ్రహించి అఫ్జల్ ఖాన్‌కి తన సైన్యంలో మంచి ఉద్యోగం ఇచ్చాడు. తనని అంతగా సత్కరించిన రాయలవారు, తిమ్మరుసుల పట్ల అచంచల భక్తివిశ్వాసాలు పెంచుకున్నాడు అఫ్జల్ ఖాన్.

కొంతకాలం తర్వాత ఒకసారి రాయలవారు స్వల్ప పరివారంతో వేటకు వెళ్లారు. అదను చూసి బహమనీ సుల్తాన్‌లలో ఒకరు తన సైన్యంతో రాయలవారి పరివారాన్ని చుట్టుముట్టాడు. ఆ సైన్యాన్ని ఎదుర్కొనే అవకాశం లేదు. తంత్రం ఒక్కటే మార్గం అని నిశ్చయించాడు తిమ్మరుసు. రాయలవారికి నచ్చచెప్పి సంధి సందేశాన్ని రాయించి అఫ్జల్ ఖాన్ ద్వారా సుల్తాన్‌కి పంపించాడు.

అది చదివేసరికి సుల్తాన్ అగ్గిబుగ్గయిపోయాడు.

అందులో సుల్తాన్‌ను పరమనీచంగా తిడ్తూ రాసుంది. కోపం పట్టలేక ఆ సందేశ పత్రాన్ని నేలమీదికి విసిరికొట్టి దానిమీద ఉమ్మివేసి కాలితో తొక్కి నలిపాడు సుల్తాన్.

తన ప్రభువును అవమానించడాన్ని సహించలేకపోయాడు అఫ్జల్ ఖాన్.

వెంటనే ఒరలోంచి కైజార్ తీసి పులిలాగా ఎగిరి సుల్తాన్‌ని పొడిచివేశాడు. అంతా లిప్తపాటులో జరిగిపోయింది. సుల్తాన్ చనిపోవడంతో అతని పరివారం, సేనలు చెల్లాచెదరైపోయాయి. ఆ విధంగా రాయలవారికి విజయనగర సామ్రాజ్యానికి పెద్ద ప్రమాదం తప్పింది.

అప్పుడు తిమ్మరుసు అన్నాడు– "ప్రభూ... వెర్రికోపం ఉండడం కూడా ఒక అరుదైన లక్షణం. ఒక్కోసారి అదికూడా ఉపయోగపడ్తుంది. అందుకే ఖాన్‌ని గౌరవించి మనకు పరమ విధేయునిగా, భక్తునిగా మార్చాను. ఇటువంటి ఉపద్రవం రావచ్చునని ఊహించి అతడిని మన వెంట తెచ్చాను. సుల్తాన్‌కి కోపం వచ్చేలాగా సందేశం రాసి, ఖాన్ ద్వారా పంపించాను. అతని వెర్రికోపమే ఈనాడు మనల్ని ప్రమదం నుంచి తప్పించింది" అని వివరించాడు తిమ్మరుసు.

భద్రంగారికి ఈ కథ గుర్తుకి వచ్చింది.

'నీ చేతివాటం గమనించాను. నీ ప్రజ్ఞని గుర్తించాను. నీ చొరవకు ముగ్ధుడనయ్యాను. నువ్వు పైకి వస్తావు బిడ్డా. నిన్ను అఫ్జల్ ఖాన్ అంతటివాడిని చేస్తానయ్యా అబ్దుల్ రజాకు!' అని మనసులోనే అనుకున్నాడు. అఫ్జల్ ఖానే ఈ జన్మలో అబ్దుల్ రజాకేమోననిపించింది. అందుకే రజాక్ విషయం బయటపెట్టి అతని పరువు తీసి అల్లరిపాలు చేయదలచుకోలేదు. కనీసం అంతరంగికంగా కూడా తాను చూసిన విషయాన్ని శివరావుగారికి చెప్పలేదు.

మర్నాటినుంచి అబ్దుల్ రజాక్ పట్ల ప్రత్యేకాభిమానం చూపించసాగారు భద్రంగారు. అతనికి అతితక్కువ పనివుండే సీటు ఇచ్చాడు. ఏ అవసరం వచ్చినా రజాక్‌కి చెప్పేవాడు.

"అదెంతపని సార్... నేను చేసుకువస్తాగా!" అంటూ చిటికె వేసి నిజంగానే చిటికెల మీద ఆ పని చేసుకువచ్చేవాడు రజాక్.

“రజాకూ... రేపు డైరెక్టర్‌గారు క్యాంప్‌కి వస్తున్నారు. స్టేషన్‌కి కారు పంపితే బాగుంటుంది” అని ఓ సన్నాయి నొక్కు నొక్కేవారు భద్రంగారు.

“నేనున్నానుగా సార్... మీరు నిశ్చింతగా ఉండండి” అని మర్నాటికల్లా కారు ఏర్పాటు చేసేవాడు. ఊరిలో ఏ పెద్ద ఇండస్ట్రియలిస్ట్ దగ్గరికో, బిజినెస్ మాగ్నెట్ దగ్గరికో వెళ్లేవాడు. తన వాక్చాతుర్యంతో అందమైన అబద్ధాలని కలిపి వాళ్ళని ఉబ్బేసి వాళ్ళ కారు సంపాదించేవాడు. ఆఫీసర్‌గారిని తీసుకురావడానికీ, తీసుకువెళ్లడానికే కాకుండా, ఊరిలో తిప్పడానికీ, దగ్గరలోవున్న దర్శనీయ స్థలాలను చూపడానికి కూడా కారు ఏర్పాటు చేసేవాడు.

ఎవరైనా ఆఫీసర్ బదిలీ మీద కొత్తగా వస్తుంటే ఆయన వచ్చేటప్పటికి అన్ని హంగులూవున్న అందమైన ఇంటిని అందుబాటులో ఉండే ‘అడ్డా’లో చూపించేవాడు. ఆయన రాగానే సామానంతా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు నుంచి తెప్పించి, ఆ కేసుల్ని ఓపెన్ చేసి ఇంట్లో చక్కగా సర్దేవాడు. ఆఫీసర్ వెళ్లిపోతున్నా అంతే! అంతా తానే స్వయంగా ప్యాక్ చేసి పంపేవాడు. అయ్యగారిని కారులో స్టేషన్‌దాకా స్వయంగా సాగనంపి, వాళ్ళు వెంట తీసుకువెళ్లే సామానుని కూడా- కూలీకి మోసే అవకాశం ఇయ్యకుండా తానే మోసి కోచ్‌లో పెట్టి రైలు కదిలేదాకా ఉండి మరీ వచ్చేవాడు.

కొత్తగా వచ్చిన ఆఫీసర్‌కి రేషన్‌కార్డ్ ఇప్పించడం- లేదా మార్పించడం, అది వచ్చేలోగా కంట్రోల్ ధరకి చక్కెరా, కిరోసిన్, బియ్యం వంటివి ఇప్పించడం, కాలక్షేపానికి సినిమా కాంప్లిమెంటరీ పాస్‌లు తెప్పించడం వంటివి చేసేవాడు. ఇంట్లో పురుళ్లూ, పుణ్యాలూ, పెళ్ళిళ్లూ, తద్దినాలూ వంటివి వస్తే సర్వమూ తానేయై మెలిగేవాడు. ఎవరికైనా యూరిన్ టెస్ట్ చేయవలసివస్తే ఆ సీసాని కూడా శ్రీరాముని పాదుకలులాగా తానే మోసుకువెళ్లేవాడు. లాండ్రీకి బట్టలు తీసుకువెళ్లడం, తీసుకురావడం సరేసరి!

ఇలా ఇదీ అదీ అనకుండా, ఉచ్ఛ-నీచ వివక్షత లేకుండా సర్వకార్యాలూ ఏకధాటిగా అత్యంత సమర్థవంతంగా నిర్వర్తిస్తూ... అందరు ఆఫీసర్‌ల గుండెల్లోనూ గూడుకట్టుకుని పదిలమైన, పటిష్టమైన స్థానాన్ని ఏర్పాటుచేసుకున్నాడు.

అయితే... ఈ ఘనకార్యాలూ, ‘జఘన’కార్యాలూ సాధించడానికి అతను ఎన్నో అబద్ధాలు ఆడవలసి వచ్చేది. ఎన్నెన్నో కట్టుకథలు చెప్పవలసివచ్చేది. తాను ఎలా, ఎటువంటి అబద్ధాలను ఆడి, ఆ ఘనకార్యాలను సాధించిందీ సాటి ఉద్యోగుల ముందు అభినయ పూర్వకంగా, సగర్వంగా చెప్తుండేవాడు. చివరికి పరిస్థితి ఎంతగా ముదిరిందంటే... రాళ్లలో బియ్యం ఏరినట్లు- రజాక్ చెప్పే మాటల్లో నిజాలు ఏవో, అబద్ధాలు ఏవో వెతుక్కోవలసిన అవసరం ఏర్పడింది.

అతని ఘనకార్యాలను విన్న ఒక వక్రకవి ఒకసారి "నువ్వు అబ్దుల్ రజాక్‌వి కావు. అబద్ధాల రజాక్‌వి!" అని నిందాస్తుతి చేశాడు. అంతే... అప్పటినుంచీ 'అబద్ధాల రజాక్' అన్నపేరు స్థిరపడిపోయింది. అందరూ బాహాటంగా అతన్ని అలాగే పిలవసాగారు. అందుకు అతనికి కోపం వచ్చేది కాదుకదా... దానిని కాంప్లిమెంట్‌గా తీసుకుని, మురిసిపోయేవాడు.

తాను అనుకున్న విధంగా రజాక్‌ను మలచగలిగినందుకు మనసులోనే మురిసిపోయాడు భద్రంగారు.

ఒకరోజున ఆయన రజాక్‌ని పిలిచి, "హైదరాబాద్‌నుంచి రేపు 9:30కి ఛైర్మన్‌గారు వస్తున్నారు ఇన్‌స్పెక్షన్‌కి. మనందరం అరగంటముందే స్టేషన్‌లో ఉండాలి. స్టాఫ్ కారు ఉందికాబట్టి నువ్వు ఆ విషయం చూడనక్కరలేదు" అన్నారు.

"అలాగే సార్... నేనుంటాగా- మీరు కొంచెం ఆలస్యంగా వచ్చినా పర్వాలేదు" అన్నాడు రజాక్ తన సహజధోరణిలో.

"అదికాదయ్యా ప్రాబ్లం..! ఆయన్ని మనవాళ్ళెవరూ చూడలేదు. ఫస్టుక్లాసులో వస్తున్నాడని తెలుసు కాని, కోచ్ నంబర్ తెలీదు. ఆయన్ని గుర్తుపట్టడం ఎలాగో అర్థంకావడం లేదు" అన్నారు భద్రంగారు.

"దీనికంత వర్రీ అవడం ఎందుకు సార్? ఆయన పంజాబ్ వాడు. పేరు కపూర్. పంజాబీ వాళ్ళు సహజంగా ఒడ్డూ, పొడుగ్గా ఆరడుగులు ఉంటారు. పేరులో సింగ్ లేదు కాబట్టి సిక్కుల గడ్డం, తలపాగా ఉండవు. కంపార్ట్‌మెంట్‌ల నుంచి దిగుతున్న భారీ విగ్రహాల మీద ఓ కన్నేసి ఉంచితే తేలిగ్గా గుర్తుపట్టవచ్చు. పైగా... రిజర్వ్‌డ్ ఛార్ట్‌లో ఆయన పేరు, బెర్త్ నంబరూ ఉంటాయి కూడాను!" అన్నాడు రజాక్.

"రజాక్... నీది డిటెక్టివ్ బుర్రయ్యా- కర్మకాలి ఇక్కడ గుమాస్తా అయ్యావుకాని! అదికాదు ప్రాబ్లం... మనం ప్రయాణీకుల లిస్టు చూసుకుంటూ నంబర్ వెతుక్కునే లోపల ఆయన దిగిపోతేనూ! అదే నా దిగులు" అన్నాడు భద్రంగారు.

"చెప్పాను కదా సార్... భారీ పర్సనాలిటీలను చూసుకుంటే సరిపోతుందని! అయినా... నేనున్నాను కదాసార్- నాకు వదిలేయండి" అన్నాడు రజాక్ భరోసాతో.

మర్నాడు అందరూ స్టేషన్‌కి వెళ్లారు.

ఫస్టుక్లాస్ బోగీలు రెండు ఉన్నాయి. రైలు ఆగీ ఆగగానే రజాక్, భద్రంగారు చెరో ఫస్ట్‌క్లాస్ బోగీ దగ్గరికి వెళ్లి ఛైర్మన్‌గారి పేరు వెతకసాగారు. వెతుకుతూనే ఓ కన్ను దిగుతున్న భారీకాయాల మీద వేసివుంచారు. పేరు కంటపడడం కష్టం అయింది. ఎందుకంటే... అక్షరాలన్నీ బాగా చెరిగిపోయాయి.

ఎలాగైతేనేం... పేరు పట్టుకునేసరికి ప్రయాణీకులందరూ దిగి వెళ్లిపోసాగారు. భారీవిగ్రహాలను నిశితంగా పరికిస్తూ, మధ్యమధ్య గడ్డంలేని శాల్తీలను "ఎక్స్‌క్యూజ్ మీ... ఆర్ యూ మిస్టర్ కపూర్?" అని పలకరిస్తూ.., వాళ్ళు కాదని చెప్పేసరికి ఆందోళన పడసాగారు- భద్రంగారు, రజాక్.

ఫస్ట్‌క్లాస్ ప్రయాణీకులు అందరూ దిగి వెళ్లిపోయారు.

చివరికి పిట్టలాంటి ఒక పొట్టి, పొట్ట మనిషి పంజరంలోంచి బయటకు వస్తున్నట్లుగా డోర్‌లోంచి దిగసాగాడు, సామాను ఈడుస్తూ.

ఎందుకైనా మంచిదని రజాక్ ఆయన దగ్గరికి వెళ్లి- "ఎక్స్‌క్యూజ్ మీ సార్... ఆర్ యూ..." అంటూ అడగబోయాడు.

"యస్! ఐయామ్ మిస్టర్ కపూర్!" అంది ఆ శాల్తీ- ఎలక మీసాలవంటి మీసాల పరకల క్రిందనుంచి నవ్వుతూ.

'ఈయన కపూరా! ఈయనకి ఓపిక పూరా!' అనిపించింది రజాక్‌కి.

"సార్..!" అని గట్టిగా అరిచాడు రజాక్.

ఆందోళనగా వెతుకుతున్న భద్రంగారు వెనక్కి పరుగెత్తుకు వచ్చారు.

"సార్... వీరే ఛైర్మన్‌గారు!" అని చెప్పి, "సార్... వీరు మిస్టర్ భద్రం- ఆఫీస్ సూపరింటెండెంట్. ఐయామ్ అబ్దుల్ రజాక్!" అని స్వ, పర పరిచయం చేశాడు రజాక్.

"ఐ థాట్ నోబడీ కేమ్ టు రిసీవ్ మీ!" అన్నారు కపూర్‌గారు.

"హౌ కుడ్ ఇట్ బి సర్?!" అన్నారు భద్రంగారు, రజాక్ ఒకేసారి.

వారిద్దరూ ఛైర్మన్‌గారిని తీసుకుని బయటకు వచ్చారు.

ఆఫీసర్‌ని రిసీవ్ చేసుకోగానే మెళ్లో దండ వేయడం రివాజు. కపూర్‌గారికి మెళ్లో దండ వేయలేదన్న విషయం భద్రంగారికి గుర్తుకు వచ్చింది. దానిని తెమ్మని ఆఫీసులో సోమయ్యకి చెప్పాడు. వెనకాలే వస్తున్న సోమయ్యని "దండ ఏదీ?" అని అడిగారు.

"నేను రామయ్యకి చెప్పాను సార్!" అంటూ, "రామయ్యా... దండ ఏదీ?" అని అడిగాడు సోమయ్య. వాళ్ళూ స్టేషన్‌కి వచ్చారు.

"ఆ.... తెచ్చాను. అరే.... ఆఫీసులో మరిచిపోయాను" అని నాలుక కరచుకొని కంగారుగా ముఖం పెట్టాడు రామయ్య.

భద్రంగారి గుండెల్లో పిడుగు పడింది.

"రజాక్... ఇప్పుడెలా? ఏం చేయడం..?" అన్నాడు దిగులుగా.

కపూర్‌గారికి తెలుగు రాదు కనుక, వారు ధైర్యంగా తెలుగులోనే దిగులు పడ్తున్నారు.

రజాక్ ఏమీ మాట్లాడకుండా ఒకసారి స్టేషన్ బయటకి చూశాడు. కొంచెం దూరంలో పది, పన్నెండు కార్లు పార్క్ చేసి ఉన్నాయి. వాటిలో ఒకటి సరికొత్త కారు. ఆరోజే నగరవీధిలో 'ఆరంగేట్రం' చేయించారు కాబోలు... దానిముందు హుక్‌కి ఒక దండ వ్రేలాడుతూ ఉంది.

రజాక్ బుర్ర చురుకుగా పనిచేసింది.

"సార్... మీరు ఛైర్మన్‌గారితో మాట్లాడుతుండండి" అంటూ ఛంగున అటు లంఘించాడు. మరునిమిషంలో ఆ దండ తీసుకువచ్చి భద్రంగారి చేతిలో భద్రంగా ఉంచాడు.

భద్రంగారు హాయిగా ఊపిరి తీసుకున్నారు. కృతజ్ఞతాపూర్వకంగా రజాక్ వంక ఒకసారి చూసి ఆ దండని కపూర్‌గారి మెడలో వేశారు. అందరూ చప్పట్లు కొట్టారు.

"వై ఆల్ దీజ్ ఫార్మాలిటీస్..!?" అంటూనే మెడవంచి దండ వేయించుకుని, ఆ తర్వాత దానిని తీసి ప్రక్కనున్న రజాక్ చేతికి ఇచ్చారు.

కపూర్‌గారిని కారులో ఎక్కించి తాను వెంట ఉండి గెస్ట్‌హౌస్‌కి బయలుదేరారు భద్రంగారు. కారు అటుపోగానే రజాక్ తిరిగి వడివడిగా వెళ్లి ఆ దండను ఆ కారుకి వేసేశాడు.

రజాక్ చూపిన చాతుర్యానికి ముగ్ధులైపోయారు భద్రంగారు.

ఆఫీసుకి వెళ్లాక పరువు నిలిపినందుకు బాహాటంగా కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత "రజాక్... ఇంకొక్క పని చేయాలయ్యా!" అన్నారు.

"చెప్పండి సార్... నేనున్నానుగా!" అన్నాడు రజాక్ తన్మయత్వంతో.

"కపూర్‌గారు సముద్రం ఎప్పుడూ చూడలేదట. అందులోనూ ఈవేళ పౌర్ణమి. సాయంత్రం బీచ్‌కి వెళ్లి కొంతసేపు గడిపి, ఆ తర్వాత వెన్నెట్లో సముద్రాన్ని చూసి ఆనందించాలనుకుంటున్నారు" అన్నారు భద్రంగారు.

"అలాగే చేద్దాం సార్! ఇందులో సమస్య ఏముంది?"

"అదికాదు... సాయంత్రం ఏ ఐదింటికో అక్కడికి వెళ్లాలి కదా! ఆయన వాలకం చూస్తే రాత్రి ఏ పదింటివరకో అక్కడ ఉండాలని అనుకుంటున్నట్లుంది. మరి, ఆయన్ని అంతసేపు ఎక్కడ ఉంచడం? భోజనం ఎలా ఏర్పాటు చేయడం? అక్కడేమీ హోటళ్లు కూడా లేవే?!" అన్నారు తల పట్టుకుని భద్రంగారు.

"ఓ పని చేద్దాం సార్... బీచ్ ఒడ్డున రాజా ప్రసాదరాయ బహద్దూర్ వారి బంగళా ఉంది. అందులో ఏర్పాటు చేద్దాం" అన్నాడు రజాక్.

"కాని, రాజావారు అక్కడ ఉండరుగా... వేరే ఊళ్లో ఉంటారు. బంగళా ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది. ఎవర్ని అడగడం?"

"అవన్నీ నిజమే! కాని, సార్... మరేం పర్వాలేదు. ఆ బంగళాకి వాచ్‌మన్ ఉంటాడు. వాడు నాకు తెలిసినవాడే. వాడి చేతిలో ఓ పదో, పరకో పెట్టే సంతోషంగా తలుపులు తీస్తాడు. ఓ పనిచేద్దాం... ఎలాగూ ఛైర్మన్‌గారు వెళ్లేలోగా పార్టీ ఇస్తాం కదా- ఊరిలో మన డిపార్టుమెంట్‌లో ఆఫీసర్‌రాంక్ వాళ్ళు ఓ పదిహేనుమంది దాకా ఉన్నారు. అందరూ కలిసి ఆయనకు డిన్నర్ ఏర్పాటుచేస్తే సరి! హాట్‌డ్రింక్స్, గానాబజానా కూడా ఏర్పాటుచేస్తే ఆయన ఖుష్ అయిపోతాడు."

"అంతా బాగానే ఉంది కాని, ఇంత తక్కువ వ్యవధిలో ఇది సాధ్యం అవుతుందా?"

"మీకెందుకు సార్... నేను వెంటనే వెళ్లి వాచ్‌మన్‌తో మాట్లాడివస్తాను. ఆ వెంటనే మీరు అందరికీ ఫోన్‌ల మీద చెప్పండి. ట్రాన్స్‌పోర్టేషన్, డిన్నర్ వగైరాల ఏర్పాట్లన్నీ నేను చూసుకుంటాను."

"ఏమో నాయనా... అంతా నీదే భారం!" అన్నారు భద్రంగారు.

రజాక్ వెంటనే వెళ్లి ఆ బంగళా వాచ్‌మన్‌తో మాట్లాడాడు. వాడు ముందు ఒప్పుకోలేదు.

"మా దొరకి ఒక జర్మన్ దొరసాని ఉన్న విషయం మీకు తెలుసుగా సార్... ఆయనకి ఎప్పుడు బుద్ధి పుడితే అప్పుడు చెప్పాపెట్టకుండా ఆయమ్మని వెంటేసుకుని కారు మీద వచ్చేస్తాడు. ఆయన ఏరోజు వచ్చినా రావచ్చు. ఎంత రాత్రయినా రావచ్చు. ఈరోజు వచ్చాడంటే నా తోలు ఒలిచేస్తాడు" అని గోలపెట్టాడు.

"ఆ భయం నీకేమీ అక్కరలేదు. మీ దొరతో ఇంతకుముందే చెప్పాను. ఆయన ఈరోజు వస్తానని చెప్పలేదు. ఆయన వచ్చినా ఏమీ అనడు. నేను ఆయనకి బాగా తెలుసు" అని నాలుగు అబద్ధాలు ఆడేసి ఓ ఇరవై రూపాయల నోటును వాడి చేతిలో పెట్టాడు రజాక్.

డబ్బు చూడగానే వాచ్‌మన్ మెత్తబడ్డాడు. "నాకు భయంవేస్తోంది దొరా!" అంటూనే తీసుకున్నాడు.

"ఎంతసేపు ఉంటాం... సాయంత్రం ఐదింటికి వస్తాం. తెల్లవారుఝాము ఐదు కాకుండానే వెళ్లిపోతాం. ఈమాత్రందానికి భయం ఎందుకు? ఇది కూడా ఉంచు" అంటూ మరో పది రూపాయలు చేతిలో కుక్కాడు.

ఇంకేమీ మాట్లాడలేదు వాచ్‌మన్.

"సాయంత్రం మీరు వచ్చేసరికి బంగ్లా అంతా ఊడ్చి శుభ్రంచేసి ఉంచుతా దొరా!" అన్నాడు.

రజాక్ ఆఘమేఘాల మీద వెళ్లి తన వీరవిజయగాథ అభినయపూర్వకంగా భద్రంగారికి వినిపించాడు.

"శహభాష్..!" అంటూ ఆయన రజాక్ భుజాన్ని తట్టూ... "నువ్వు సాక్షాత్తూ హనుమంతుడివోయ్!" అన్నారు.

రజాక్ ఉబ్బిపోయాడు. హనుమంతుడిలాగా ఒక మోకాలు మడిచి కూర్చోలేదు కాని, కళ్లలో మాత్రం ఆ తన్మయత్వాన్ని గుప్పించాడు.

భద్రంగారు ముందుగా ఛైర్మన్‌గారికి బీచ్ బంగళాలో రాత్రి డిన్నర్ వగైరాల ప్రోగ్రాం ఏర్పాటు చేసిన విషయం తెలిపి ఆయన సరేనన్నాక, ఆఫీసర్లు అందరికీ చెప్పారు.

బయటపనులు చూడడానికి రజాక్ వెళ్లిపోయాడు.

సాయంత్రం ఐదింటికి కపూర్‌గారు, డైరెక్టర్‌గారు, భద్రంగారు స్టాఫ్ కార్లోనూ, వారి వెనుక ఓ పదిహేనుమంది ఇతర ఆఫీసర్లు, నలుగురు గుమాస్తాలూ, ఇద్దరు ప్యూన్‌లూ రజాక్ ఆధ్వర్యంలో ఒక మెటాడోర్ వ్యాన్‌లోనూ బీచ్ బంగ్లా దగ్గరికి చేరుకున్నారు. వెంట తెచ్చిన సామాన్లని లోపలపెట్టారు.

దేవకన్యలు భూలోక విహారానికి బయలుదేరినట్లు పరివారం వెంటరాగా కపూర్‌గారు బీచ్ విహారానికి బయలుదేరారు. భూదేవీ, శ్రీదేవీలాగా అటూ ఇటూ డైరెక్టర్‌గారూ, భద్రంగారూ నడుస్తూండగా... పంజాబీ జోక్‌లు పేలుస్తూ తెల్లని ఇసుక మీద మెల్లగా నడవసాగారు కపూర్‌గారు.

డ్రైవర్లని, తెల్లవార ఐదింటికి రమ్మని చెప్పి పంపించేసి తానుకూడా వచ్చి రామబంటులాగా వారి వెనక నడవసాగాడు రజాక్. మిగిలినవారు సేఫ్ డిస్టెన్స్‌లో వారికి మరికొంచెం వెనక నడవసాగారు.

సూర్యాస్తమయ సమయం. ఎర్రని సూర్యబింబం పశ్చిమాన సరుగుతోటల వెనక కనుమరుగవుతోంది. పున్నమిచంద్రుడు పూర్తి బింబంతో తూర్పున సముద్రం నుంచి పైకి వస్తున్నాడు. సముద్రజలాలు కదులుతూ... ఆ వెన్నెలకాంతికి కరిగించిన వెండిలాగా మిలమిల మెరుస్తున్నాయి. పూర్ కపూర్... జన్మలో ఎప్పుడూ సముద్రాన్ని చూసి ఎరుగడేమో- ఆ మనోజ్ఞ దృశ్యాన్ని తనివితీరా చూసి ఆనందిస్తున్నాడు.

రాత్రి ఎనిమిది గంటలవరకు బీచ్ విహారం చేస్తూ వెన్నెల వైభవాన్ని చూశాక అందరూ బంగళాకి తిరిగివచ్చారు.

అప్పటికే క్యాటరర్స్ వచ్చి రెడీగా ఉన్నారు. అతిథులు రాగానే వారు డిన్నర్ ఏర్పాట్లు చకచకా చేయసాగారు. అందరూ ఒకప్రక్కన కుర్చీలలో కూర్చున్నారు. ఎదురుగా మెత్తని

బాలీసుల మీద గాయకబృందం కూర్చుని గానాబజానా మొదలుపెట్టింది. తనకు జరుగుతున్న రాచమర్యాదలను చూస్తూ, అనుభవిస్తూ మురిసిపోతున్నారు కపూర్‌గారు.

అతిథులందరికీ సూప్ సర్వింగ్ అయింది. వారు దానిని చప్పరిస్తుండగా బల్లల మీద మెనూ ఐటమ్స్‌ని రెడీ చేశారు.

భద్రంగారు ప్లేట్‌లో పదార్థాలను వడ్డించి స్వయంగా తీసుకువెళ్లి ఛైర్మన్‌గారి కరకమలాలలో ఉంచారు.

రజాక్ అదే ఫక్కీలో డైరెక్టర్‌గారికి వడ్డించాడు. మిగిలినవారు ఎవరికి వారు ప్లేట్లలో తీసుకుని తినసాగారు.

మరో ముప్పావుగంటలో భోజన కార్యక్రమం పూర్తి అయింది.

అందరూ తిరిగి కుర్చీలలో కూర్చున్నారు. హాట్‌డ్రింక్స్‌ను స్వయంగా సర్వ్ చేయడం మొదలుపెట్టాడు రజాక్.

గానాబజానా తీరు మారింది. అర్ధనగ్నంగా వున్న సుందరీమణులు రంగప్రవేశం చేశారు. బాలీసుల మీదవున్న గాయకబృందం రెండర్థాల పాటల్ని పాడుతుంటే నర్తకీమణులు ఆ భావాలకు అనుగుణంగా వివిధ భంగిమలలో నాట్యం మొదలుపెట్టారు.

కపూర్‌గారి ముఖం దివిటీలా వెలిగిపోయింది. అందరూ తన్మయత్వంలో మునిగిపోయారు. అందరికీ కైపు ఎక్కింది. మాంఛి నిషాలో ఊగిపోతున్నారు.

పానకంలో పుడకలాగా, మధురగానం మధ్యలో అపశృతిలాగా బయట కారుహారన్ మ్రోగింది. అది వినగానే వాచ్‌మన్ పైప్రాణాలు పైనే పోయాయి.

"సార్... మా దొర వచ్చేశాడు. ఇప్పుడేమిటి చెయ్యడం?" అంటూ తల బాదుకుంటూ గేటు తీయడానికి పరుగెత్తాడు.

"ఎవర్రా లోపలుంది? ఏమిటా గోల?" అంటూ అరుపులు వినిపించాయి.

చేతితో సంజ్ఞ చేసి గానాబజానా ఆపించాడు రజాక్.

తెగువ తెచ్చుకుని బయటకు వచ్చి "నమస్కారం సార్... నేను రజాక్‌ని. ఈ ఊరి..." అంటూ మొదలుపెట్టాడు తడి ఆరిన గొంతుతో.

"నువ్వెవరైతే నాకేటి బే! ఎవరు లోపలుంది?" అని గట్టిగా అరిచాడు రాజా ప్రసాదరాయ బహద్దూర్. ఆయన వెంట ఆయన 'జర్మన్ ప్రియురాలు' కూడా ఉంది. వెన్నెలరాత్రి బీచ్‌లో ఎంజాయ్ చేయాలని వచ్చారు ఆ ప్రేమికులు.

"దొరా... ఈయనే చెప్పిండు తమర్ని అడిగానని!" అన్నాడు వాచ్‌మన్ రజాక్‌ని చూపుతూ.

"వాడెవడురా చెప్పడానికి.., నువ్వెవరు ఇయ్యడానికి?" అంటూ నడుంకి వున్న బెల్టు తీసి గొడ్డుని బాదినట్లు బాదసాగాడు వాచ్‌మన్‌ని.

"రచ్చించండి దొరా..." అంటూ ఆయన కాళ్లమీద పడ్డాడు వాచ్‌మన్.

"స్టొపిట్ ఐసే!" అంది జర్మన్ నారి.

కొట్టడం ఆపి లోపలికి వచ్చాడు రాజావారు.

అప్పటికి అయ్యవార్ల నిషా చాలావరకు దిగిపోయింది. ప్రళయరుద్రుడిలా చిందులు తొక్కుతూ రంకెలు వేస్తున్న ఆయన్ని చూడగానే అందరి ప్రాణాలూ పైనే పోయాయి. గానాబజానా వాళ్ళు తమ సరంజామా సర్దుకోసాగారు.

"ఎవర్రా వీళ్ళంతా... దొంగనాయాళ్ళు?" అని అరిచారు రాజావారు.

"వీరు ఛైర్మన్‌గారు. పంజాబ్ నుంచి వచ్చారు. వీరు ఆఫీసర్లు..." అంటూ హీనస్వరంతో చెప్పడం మొదలుపెట్టాడు రజాక్.

"ఆఫీసర్లా- గాడిద గుడ్డా..? ఆఫీసర్లయితే దొంగచాటుగా నా బంగళాలోనికి వస్తారా బే..?! లంజకొడుకులు.., లండీకొడుకులు..." అంటూ తిట్లందుకుని, "ఒరేయి... దొంగనాయాళ్ళలారా- పది నిమిషాలలో మీరందరూ బంగళా ఖాళీ చేసి బయటకు పోకపోయారంటే మిమ్మల్ని పిట్టల్ని కాల్చినట్లు కాల్చేస్తా. ఒరేయ్... కారులో నా గన్ ఉంది- తీసుకురా!" అని వాచ్‌మన్‌తో గట్టిగా అరిచాడు.

"చిత్తం దొరా!" అంటూ ఛంగున బయటకువెళ్లి గన్ తెచ్చి దొరకి ఇచ్చాడు వాచ్‌మన్.

అసలే ఫారిన్ విస్కీ బాగా పట్టించి కైపు మీదున్నాడు రాజావారు. దానికితోడు- పట్టరాని ఆవేశం! చింతనిప్పుల్లాంటి కళ్లతో చూస్తూ మనిషి ఆసాంతం ఊగిపోతున్నాడు. తుపాకీ ఎక్కుపెట్టి, "ఇంకా నుంచున్నారే.... పొండి బే... పోతారా- కాల్చేయమంటారా?" అని అరిచాడు.

రజాక్ ధైర్యం తెచ్చుకుని, "సార్... ఇప్పుడు వెళ్లడానికి బస్‌కూడా ఉండదు. చీకటి పోకముందే తెల్లవారే వెళ్లిపోతాం!" అని చెప్పబోయాడు.

"ఎవడ్రా నువ్వు? బుద్ధి లేదట్రా నీకు? చెప్తుంటే మనిషికి కావూ? పోతారా... ముందు నిన్నే కాల్చమంటావా?" అంటూ గన్‌ని రజాక్ వైపు తిప్పాడు.

"వద్దు సార్... వద్దు... ఇప్పుడే పోతాం!" అని, "పదండి సార్!" అంటూ అందర్నీ తొందరపెట్టాడు రజాక్.

అంతే..! ఇంక కపూర్‌గారు, ఆఫీసర్‌లు, మిగిలినవారు ఎక్కడి సామాను అక్కడే వదిలేసి పరుగు లంకించుకున్నారు. కొందరు లుంగీలు, బనీన్లతో, కొందరు కేవలం

అండర్‌వేర్‌లతో అలాగే పరుగులు తీశారు. అందరూ సరుగుతోటల్లో పడి, మెయిన్‌రోడ్ వచ్చేదాకా ఒకటే పరుగు. ఆ హడావుడిలో వాళ్ళు చెప్పులు కూడా వేసుకోలేదు. బ్రతుకుజీవుడా... అంటూ ఒకటే పరుగు.

వాళ్ళంతా బయటకు పోగానే- "ఒరేయ్... ఈ లంజకొడుకులు వదిలేసిన సామాన్లన్నీ బయట పారేసి బంగళా అంతా బాగా శుభ్రంగా కడుగు" అని ఆయన వాచ్‌మన్ మీద అరిచిన అరుపులు ఆ ప్రశాంత వాతావరణంలో పరుగులిడుతున్న వారికి వినిపిస్తూనే ఉన్నాయి.

అప్పటికి రాత్రి సుమారు ఒంటిగంట అయింది. తెల్లవారి ఐదు గంటలకిగానీ తమ వ్యాన్, కారు రావు. అప్పటివరకు ఆ చలిలో వణుకుతూ అందరూ రోడ్ ప్రక్కన కూర్చున్నారు. తెల్లవారుతుండగా వాహనాలు వచ్చాక అందరూ బ్రతుకుజీవుడా... అంటూ కొంపలకు చేరుకున్నారు.

రజాక్ అంటే గిట్టనివాళ్ళు ఆ డిపార్ట్‌మెంట్‌లో చాలామందే ఉన్నారు. అలాంటివారు ఆ బంగళాకి వచ్చినవారిలోనూ ఉన్నారు. వాళ్ళు వెంటనే ఆలస్యం చేయకుండా ఇటువంటి సంచలన విషయాలను ప్రచురించే 'గబ్బు పత్రిక' అనే ఎల్లో జర్నలిజం పత్రికకు ఈ ఉప్పును సవివరంగా అందించారు. వెంటనే ఆ పత్రిక తాటికాయంత హెడ్‌లైన్లతో ప్రత్యేకసంచికను విడుదల చేసింది.

అసలే అవమానభారంతో కృంగిపోతున్న ఆఫీసర్‌లకు ఆ పత్రిక చిలవలు-పలువలుగా ప్రచురించిన ఈ వార్త పుండుమీద కారం రాసినట్లయింది. కపూర్‌గారయితే ఇన్‌స్పెక్షన్ చేయకుండానే నెక్స్ట్ ట్రెయిన్‌కి హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్లిపోయారు. 'మొగుడు కొట్టినందుకు కాదు- తోటికోడలు నవ్వినందుకు ఎక్కువ బాధ...' అన్నట్లు- జరిగిన అవమానం కంటే పత్రికలో పడి నలుగురూ నవ్వుకోవడం మరింత బాధ అయింది వాళ్ళకి.

కపూర్‌గారి అవమానం ఆగ్రహంగా మారింది. అర్ధాంతరంగా వెళ్లేముందు అంతటి అవమానానికి కారకుడైన రజాక్‌పై 'డిసిప్లినరీ యాక్షన్' తీసుకోమనీ, ఆ ఊరినుంచి బదిలీ చేయమనీ ఆర్డర్ వేసి మరీ వెళ్లారు. కొందరు ఆఫీసర్‌లు ముఖం చెల్లక సెలవులు పెట్టేశారు. మరికొందరు బదిలీ చేయించుకున్నారు.

అంతవరకూ రజాక్ చేత అడ్డమైన సేవలూ చేయించుకున్న ఆఫీసర్లే ఇప్పుడు శత్రువులయ్యారు. తలాతోకా లేని ఛార్జీలు ఫ్రేం చేసి ఛార్జిషీట్ ఇచ్చారు. 'అతను ఎప్పుడూ సీట్లో ఉండడట.., పని పెండింగ్‌లో ఉంచుతాడట!'... ఇవీ ఛార్జిలలో కొన్ని. మొత్తంమీద ఆ వంకా, ఈ వంకా పెట్టి ఆ ఊరినుంచి బదిలీ చేశారు.

ఇదంతా చూసేసరికి రజాక్ మనసు విరిగిపోయింది.


తమ అవసరాలకు అందరూ తనని వాడుకున్నవారే. వాళ్ళే తనని గోతిలోకి పడదోశారు. ఇంక ఆ ఊరిలో ఉండాలనిపించలేదు. ట్రాన్స్‌ఫర్‌కి కిక్కురుమనకుండా ఒప్పుకున్నాడు.

కొత్త ఊరిలో పాత జీవితం మరిచిపోయి బుద్ధిగా పనిచేస్తున్నా 'అబద్ధాల రజాక్' అన్న ముద్ర మాత్రం మాసిపోలేదు. దానిని తట్టుకోలేకపోయాడు. ఇంక ఆ డిపార్ట్‌మెంట్‌లోనే ఉండలేకపోయాడు. వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని వచ్చిన గ్రాట్యుయిటీ సొమ్ముతో బీడీల ఏజన్సీ తీసుకున్నాడు. అడిగినవారికీ, అడగనివారికీ కూడా ఉచిత సలహా ఇస్తుండేవాడు- "మీరు ఆఫీసర్‌లకి సహాయకరంగా ఉండండి. వాళ్ళు చెప్పిన పని చేయండి... తప్పులేదు. కాని, ఆత్మగౌరవాన్ని చంపుకుని మాత్రం చేయకండి. ఏదైనా ఎదురుతిరిగితే అంతకాలం సేవలు చేయించుకున్నవాళ్ళే ముందుగా రాళ్లు వేస్తారు. ఇది నేను అనుభవంతో చెప్తున్నాను" అని!

'అబద్ధాల రజాకీయం' ఆ విధంగా తెరమరుగైంది.

- ఆంధ్రభూమి మాస పత్రిక... అక్టోబర్ '98

## ఇప్పుడెలా..?



నలభైయ్యో పడి చివరిలో మేరీకి మళ్లీ పెళ్లి ఖాయం అయింది. పెళ్లికి ఎటువంటి బట్టలు కొనాలా... అన్న విషయంలో ఓ నిర్ణయానికి రాలేకపోయింది. ఇలా కాదని షాపువాడినే అడిగితే సరి- అనుకుంది.

"చూడండీ... రేపే నా పెళ్లి. ఏ రంగు దుస్తులు వేసుకుంటే బాగుంటుంది?" అని అడిగింది.

"మొదటి పెళ్ళయితే ఎరుపు రంగు. రెండోదైతే ఆరంజి. మూడోది పసుపు..." అంటూ ఇంద్రధనుస్సులోని ఏడు రంగుల్నీ ఏకరువు పెట్టసాగాడు ఫిజిక్స్ చదువుకున్న ఆ గుమాస్తా.

"బాగానే ఉంది కాని- మరి.., తొమ్మిదో పెళ్ళయితేనో?!" అంది మేరీ బుర్ర గోక్కుంటూ.